
# చేపలు

-బుద్ధి యజ్ఞమూర్తి

ఇంకా నల్లగానే అగుపిస్తా వుంది ఆకాశం. అల్లంత దూరంలో నల్లటి మర కల్లా గుడిసెలు. అలలతో ఎగిరిపడ్తోన్న సముద్రం కూడా నల్లదనాన్ని వదిలించుకోలేదు. విసురుగా విరుచుకు పడ్తోన్న అలలతోపాటే పడవలు కూడా అటూ ఇటూ వూగులాడుతున్నాయి.

'యియ్యాళన్నా మరిన్ని చేపలు దొరక్కపోతే పొయ్యిలో కట్టె ఎలిగేట్టు లేదు గోయిందన్నా' చేతిలోని వలని సరి చూసుకుంటూ అన్నాడు సాయిలు. యెంటనే జవాబు చెప్పలేదు గోవిందు. చేతిలోని వలని గిర్రున తిప్పాడు. ఆమైనే దాన్ని నీళ్ల మీదికి విసిరాడు.

'ఆనా కొడ్కులు యియ్యాళ కనిపిత్తే కుళ్ళబొడిచేసేటోన్నే' పళ్ల బిగించి ఆవేశంగా వల్లో తనే



అన్నాడు సాయిలు. 'యియ్యాళ చేస్తారం గదా. ఆళ్లు వొత్తారనుకోన్రా' తేల్చాడు గోవిందు.

'మన్నోటి కాడ కూడు దొబ్బి నా యాళ్లు సుకపడేదేంది. థూ... దొంగ నా కొడ్కులు. అంతకంతా అవ్దా' అంటా సాయిలు వల కుదిలించాడు. వల చప్పుడు తప్పితే లోపల ఏమీ పడ్డట్టు లేదు. సాయిలు ముఖంలో కోపం పోయి బాధ మొదలయ్యింది.

ఆకాశం నెమ్మదిగా వెలుతురుని సంతరించుకుంటోంది. తూర్పు దిక్కు పైకి వస్తా పల్చటి ఎరుపు. అలలు పైకి ఎగురుతుంటే కన్పిస్తోన్న తెలుపు.

వలని దగ్గరికి బలంగా గుంజి విసురుగా పైకి లాగాడు గోవిందు. అన్నీ చిన్నచిన్న చేపలే. నీళ్లలోంచి పైకి రావడంతో ప్రాణవాయువు అందక ఎగిరి కిందపడి కొట్టుకుంటున్నాయి. వాటి వంక ఓసారి చూసి మళ్ళీ నీళ్లలోకి వొదిలేశాడు.

'యేరా గోయిందూ. యియ్యాళ కూడా ఒక్క మొయిలు కానీ, కొర్మీను కానీ పడ్డట్టు లేదే' అడిగాడు అంజలయ్య.

'మొత్తం ఆ పుండాకోర్నాయాళ్లే దోస్కపోతా వుంటే మన్కి దొరికేదేంది. యాణ్ణించో జబర్దస్తీగా వొచ్చి యిదంతా ఆళ్ల సొత్తేనన్నట్లు తీస్కపోతా వుంటే మనం యేం చెయ్‌లేక పోతన్నాం కదా బాబాయ్' గోవిందు గొంతులో బాధ. ఆ బాధ అక్కడున్న అందరిదీ.

'అట్టా అని మనం వూర్కే సేతులు ముడ్సుకు కూకుంటే యీళ్లు దగ్గమ్మలు, మనకేం అడ్డు లేదని - ఆ యంత్రపోళ్లు దోసి పారేత్తానే వుంటారు' అంజలయ్య మాటల్లో వూరకే వుండకూడదనీ, ఏదైనా పరిష్కారం చెయ్యాలన్న భావం అందింది అందరికీ.

'బాబాయ్... యీ యిసయం మీన కొత్త పెట్నం, చిన్న గంజాం, పల్లెపాలెం నోళ్లతో మీటింగు పెడ్తే ఎట్టా ఉంటుంది' అడిగాడు గోవిందు. గోవిందు కఠారిపాలెం లోని జాలర్లందరికీ నాయకుడే కాదు పంచాయితీ మెంబరు కూడా.

'యింకెందుకు ఆలిస్యం. బేగి కబురు పంపిద్దాం. అట్టాగే ముందు మనూరోళ్లతో మీటింగు బెట్టు' సలహా యిచ్చాడు అంజలయ్య.

'వోర్నాయనో. ఎంత పనైపోనాదీ' లబలబా కొట్టుకుంటున్న సాయిలు దిక్కు చూశారంతా. సాయిలు వల ఓ పక్క మొత్తం తెగిపోయి వుంది. వల అట్లా ఎందుకు తెగుతుందో ఆళ్లందరికీ ఎరికే. అతుకులు వేయడాన్కి కూడా ఆ వల పనికి రాదు.

'ఒకిటా, రెండా... రెండేల్రూపాయలు నీళ్ల పాలైపోనాయి కద్రో. మళ్లా యింకోటి అల్లాలంటే పైకం వొచ్చే దారేది దేవుడా... మా ఇంటిదాన్కి యెట్టా మొగం చూపించేది గోయిందన్నా. దొంగ నా కొడ్కులు కడుపుల మీద కొడ్తున్నారు కదన్నా. నేనెట్టా బత్కేదన్నా' సాయిలు యేడ్పు మొదలుపెట్టాడు. అంతా సాయిల్ని వూరడించారు. అందరి గుండెలూ బరువెక్కాయి. కొద్దిసేపట్లోనే వాళ్ల గుండెల నిండా ఆవేశం, ఆగ్రహం కలనేత అయ్యాయి.

'పేనాలు పొయ్‌నా సరే ఆ నా కొడుకుల అంతు సూడాల్సిందే' అని శపథం చేశారు.

★ ★ ★

నిజాంపట్నం, ఆపైన నుంచి జబర్దస్తీగా వచ్చి మరపడవల వాళ్లు అక్కడి చేపలన్నీ పట్టుకు పోతా వుంటే వాడరేవు, కఠారిపాలెం, పల్లెపాలెం వంటి మత్స్యకార గ్రామాల్లో చేపల మీదనే ఆధారపడి బతుకుతున్న బెస్తవాళ్ల జీవితాలు అతలాకుతలమై పోతున్నాయి.

ఎక్కడో దూరంగా ఐతే ఫర్వాలేదు. తీరం మీదికొచ్చి చేపలు పట్టుకు పోతుండటంతో మత్స్యకారులంతా ఏకమై వుద్యమం చేశారు. హైదరాబాదు వెళ్లి అసెంబ్లీ ముందు బైఠాయించారు. ప్రభుత్వం అప్పుడు కళ్లు తెరిచింది. తీరం వెంబడి రెండు కిలోమీటర్ల లోపల మర పడవల్లో చేపలు పట్టకూడదని ఉత్తర్వులిచ్చింది.

ఆర్డర్ ఐతే జారీ చేసింది కానీ దాన్ని సక్రమంగా అమలు చేయాలన్న ధ్యాస మాత్రం గవర్నమెంటుకి లేదు. ఏదో ఒకటి చేసినట్లు కన్పించాలి. లేకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వొస్తుంది. తొందర్లో ఎలక్షన్లు వస్తున్నాయి. అందుచేత జాలర్లకు కోపం తెప్పించకూడదు. అందుకని వాళ్లని వూరడించడం కోసం జీవో జారీ చేసింది. అట్లా చేయడంవల్ల జాలర్లంతా తన మంచితనాన్ని గుర్తించి ఎలక్షన్లలో మళ్లీ తమ పార్టీకే వోట్లు వేస్తారనే ఆశ ప్రభుత్వానికి ఉంది.

నిజాం పట్నం యంత్రపోళ్లకి (మర పడవల వాళ్లకి) ప్రభుత్వం మీదా, దాని 'పని తనం' మీదా చాలా విశ్వాసం. ఎప్పట్లాగే వాళ్లు తీరం దరికి వస్తూనే ఉన్నారు. నాటు పడవల్నే ఆధారం చేసుకుని చేపలు పట్టుకు బతుకుతున్న బెస్తవాళ్ల కడుపులు కొడ్తూనే వున్నారు. వాళ్లని గమనించి పట్టుకుందామని ఎంత యత్నించినా వాళ్ల మరపడవల వేగాన్ని మాత్రం బెస్తవాళ్లు అందుకోలేక అంతులేని వేదన పడ్తున్నారు. గోరుచుట్టు మీద రోకలి పోటులా మరపడవల వల్ల ఇంకో ప్రమాదం కూడా వచ్చి పడుతోంది. మర పడవల నుంచి వూడిపడ్డ ఇనుప కొక్కేలు బెస్తవాళ్ల వలలకి తగులుకుని వాటిని ఎందుకూ పనికిరాని విధంగా తెంపేస్తున్నాయి. ఒకపక్క చేపలు దొరక్క అల్లాడుతున్న బెస్తవాళ్లకి ఇది మరింత పెద్ద సమస్య ఐంది.

చిన్న చేపల్ని మింగే పెద్ద చేపల్లా సముద్రం మీద మరపడవలు వుత్తరం దిక్కు నుంచి దూసుకు వచ్చాయి. వాడరేవు దాటాయి. తెల్లవారుఝాము నాలుగున్నర... మూడు పడవలు కఠారిపాలెం తీరం వద్ద ఆగితే మిగతావి దక్షిణం వేపు యింకా ముందుకి సాగాయి.



ఒక్కో వల తయారుచేయాలంటే కనీసం రెండు వేలు ఖర్చవుతుంది. కొన్ని నెలలుగా యంత్రపోళ్ల పుణ్యమా అని చేపలు సరిగా పడక తిండికి కటకట లాడుతున్న బెస్త పోళ్లకి కొత్త వల అల్లుకోవాల్సి రావడం ప్రాణ సంకటం.

* * *

'వూ... వొదులు మావా... రేత్రి పగలని లేక ఏటీ పరాసి కాలు. ఎవరైనా వొత్తే ఛండాలంగా ఉంటదని నీకసలు వుండదు' చేతులు గుంజుకుంది మణెమ్మ.

'యేయ్ మణీ... కోపంలో కూడా నువ్వెంత సక్కంగా వుంటావే. నిన్ను చూసే కొద్దీ నా పేనాలు నిలవ్వేందే' మణెమ్మ బుగ్గ మీద చటుక్కున ముద్దు పెట్టుకుని గుడిసె ముందు యిసికలో కూలబడ్డాడు గోవిందు.

'అబ్బో మాటల్తోనే బోల్తా కొట్టిత్తాడండీ ఈ మొగోడు' సన్నగా నవ్వి పక్కనే వున్న బావిలో నీళ్లు తోడేందుకు చేద వేసింది.

'యిప్పుడంటే నన్నేడిపిత్తన్నావ్. మన మనువవ్వక ముందు యెంత మంది మొగోళ్ల నేడ్పించాయే'

'ఛీఛీ... నీ కెప్పుడూ ఆ పాడు మాటలే. వో పక్క మనోళ్లంతా కూటికి మాడి సత్తా వుంటే యేం సెయ్యాల్నో అది యాది సేస్కోకుండా పరాసికాలు... పరాసికాలు సేత్తన్న మొగోణ్ణి యేమంటారో. నాయకుడంట మళ్లా. నాయకుడంటే యిట్నే వుంటాడా' ఈసడించింది.

వేడెక్కింది గోవిందు నెత్తురు రోషంతో. ఓ చెయ్యి మీద పైకి లేచి మణెమ్మ రెక్క పట్టుకుని లాగాడు. చేద దభేల్మని బావిలో పడిపోయింది. విసురుగా గోవిందు వొళ్లో పడింది మణెమ్మ. చప్పున ఆమె పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. 'యీ ముద్దు యెంత బలమిత్తదో నీకేం తెల్సే. యిప్పుడు రమ్మను - ఆ యంతరంగాళ్లని. వొకొక్కణ్ణి యిరిసి పారేత్తా'

'రోసమంటే అట్టా గుండాలి. యిప్పుడు నా పెనిమిటి వన్నిచ్చావు మావా' అంటా ఎదురు ముద్దు పెట్టింది.

తడక చప్పుడవటంతో ఇద్దరూ వేరయ్యారు. అంజలయ్య లోనికి వొచ్చి వాళ్ల ముందు కూర్చున్నాడు. 'కొత్తపెట్నం నుంచి యెప్పుడొచ్చినా' గోవిందు అడిగాడు.

'యింటిక్కూడా పోకుండా నేరుగా యిట్నే వొత్తున్నా'

'కనుక్కుంటివా సంగతులన్నీ'

'పొయ్యిందందుకే గదా. ఆళ్లూ మన లెక్కనే కట్టాలు పడ్తన్నార్రా. యిసియం సెప్పటంతోట్నే మీటింగెట్టడం బాగున్నదన్నారు. యెప్పుడంటే అప్పుడే వొత్తామన్నారు'

'పల్లెపాలెం నుంచి సాయిలు యింకా రాలేదేంది' అనుకుంటా పైకే అనేశాడు గోవిందు.

'యింకా రానేలేదా. ఆ పోటుగాడు యెక్కడ పెంచాయితీలు పెడ్తన్నాడో యేమో' అంజలయ్య అంటూ వుండగానే వొచ్చాడు సాయిలు.

'యేందిరా సాయిలూ. అంతదూరం పోయినోణ్ణి నీకంటే నేనే ముందర వొచ్చేత్తిని. యేడ పెత్తనాలు జేశావ్ యింతసేపూ'

'యిద్గో బాబాయ్. యెకసెక్కెం జేత్తే నాకు మండుకొత్తుంది. నేం బోయింది పెత్తనాన్కి కాదు. అక్కడంతా మనకంటే యెక్కువ కష్టం అనుబవిత్తున్నారు. ఎన్ని కష్టాలనుకున్నారు. యంత్రపోళ్ళే అనుకుంటే... దళారీగోళ్లు కూడా ఆళ్లని పీక్కు తింటన్నారు. ఆళ్ల కతలు యింటా వుంటే నెత్తురు యెట్టా మరిగిపోయిందన్కున్నావ్' చెప్తుంటేనే సాయిలు ముక్కుపుటాలు అదిరిపోయాయి. కళ్లు యెరుపెక్కాయి.

పల్లెపాలెం, కొత్తపట్నంలకి పోయినోళ్లు వొచ్చారని తెలిసి కఠారిపాలెం జనమంతా గోవిందు యింటికాడ జమయ్యారు. అంతా కల్సి మీటింగు జరిపే రోజుని నిర్ణయించారు. ఇళ్లకి కూడా పోకుండానే ఆ కబురందించడాన్కి అంజలయ్య, సాయిలు చెరో మనిషిని తీసుకుని అదే బిగువున మళ్లా కొత్తపట్నం, పల్లెపాలెంలకి పరుగులు తీశారు.

★ ★ ★

చిన్న చేపల్ని మింగే పెద్ద చేపల్లా సముద్రం మీద మరపడవలు వుత్తరం దిక్కు నుంచి దూసుకు వచ్చాయి. వాడరేవు దాటాయి. తెల్లవారుఝాము నాలుగున్నర... మూడు పడవలు కఠారిపాలెం తీరం వద్ద ఆగితే మిగతావి దక్షిణం వేపు యింకా ముందుకి సాగాయి. గ్యాస్ లైట్ల మూలంగా మర పడవల చుట్టుపక్కలంతా తెల్లటి కాంతి పరచుకుంటోంది.

మర పడవల్లోని వ్యక్తుల చేతుల్లో అధునాతనమైన పెద్ద వలలు లైటు కాంతిలో మెరుస్తున్నాయి. ఎంతో వుత్సాహంతోటి వాళ్లు వలల్ని నీళ్ల మీదికి విసిరారు. ఐదు నిమిషాలు గడిచాయి. విసిరినప్పటి కంటే ఇంకా ఎక్కువ ఉత్సాహంతో వలల్ని పైకి లాగిన వాళ్లు - ఒకరి ముఖాలొకరు అదిరిపాటుగా చూసుకున్నారు.

ఏ వలలోనూ ఒక్క చేపా లేదు. అది కాదు వింత. వలలన్నీ తెగిపోయి వున్నాయి! ఏం జరిగిందో అర్థంకాక వాళ్లు దిక్కులు చూస్తున్నారు. అంతట్లోనే మరపడవలు అటూ ఇటూ వూగిపోయాయి. ఏదో జరుగుతోందని కనిపెట్టి జాగ్రత్త పడేంతలోనే పడవలు తిరగబడిపోయాయి. అంతా నీళ్లలో పడిపోయారు. నీళ్లలో మునిగి... లేచి వూపిరి తీసుకునేంతలో... వాళ్ల గొంతుల్లో 'జల్లముక్కలు' దిగబడిపోయాయి. గొంతులోంచి కేక బయటకు వచ్చే అవకాశం లేకుండానే వాళ్ల ప్రాణాలు సముద్రం పాలయ్యాయి.

పల్లెపాలెం, కొత్తపట్నం వేపు వెళ్ళిన మరపడవల గతీ అంతే. పూర్తిగా తెల్లవారక ముందే ఆ ప్రాంత సముద్రజలం యెరుపెక్కింది. చచ్చిన వాళ్ల గొంతుల్లోంచి జల్లముక్కలన్నీ నిశ్శబ్దంగా తీరానికి చేరుకుని మాయమయ్యాయి.

* * *

రాష్ట్రమంతా ఉలికిపాటు... సంచలనం. పత్రికల్లో పతాక శీర్షికల్లో ఇదే కథ. చచ్చిన సాయంత్రానికి ఒడ్డుకి చేరిన శవాల సంగతి ఒక్కసారిగా గుప్పుమంది. ఒక్కచోట కాకుండా మూడుచోట్ల ఒకే రకంగా మరపడవల వాళ్లు హత్యకి గురవడం అందరి దృష్టినీ ఆకర్షించింది.

శవాలు పోస్టుమార్టమ్ కెళ్ళాయి. వాటి గొంతుల్లో దిగబడిందేమిటో డాక్టర్లకి అంతు చిక్కలేదు. అంతు చిక్కని ఆయుధంతో చంపబడ్డారని ఆఖరుకి తేల్చారు. ఎవరి మీద కేసు పెట్టాలో తెలీలేదు పోలీసులకి.

జిల్లా ఎస్పీ హడావిడిగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశాడు. హంతకుల్ని ఆరునూరైనా పట్టుకు తీరతామన్నాడు. రాజకీయ పార్టీలన్నీ ప్రభుత్వంపై విరుచుకు పడ్డాయి. శాంతిభద్రతల్ని అదుపులో వుంచలేని ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశాయి. ముఖ్యమంత్రి అలవాటు ప్రకారం హంతకుల్ని త్వరగా పట్టుకునే విధంగా పోలీసు అధికారులకి స్పష్టమైన ఆదేశాలిచ్చానని ప్రకటించాడు.

చాలా కాలం కఠారిపాలెం, పల్లెపాలెం, కొత్తపట్నం బెస్తపోళ్లకు మళ్ళా మరపడవల బెడద రాలేదు. కూటికి మాడే ప్రమాదమూ తప్పింది.

★

